క్లుప్తంగా

పోరాటాలకు సిద్ధం కండి

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

షాబాద్: ప్రజా సమస్యల పరిష్కారానికై పోరాటాలకు సిద్ధంగా ఉండాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని ముదిరాజ్ భవన్‌లో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొనే వివిధ గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికై కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు పోరాటాలకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీకి సిద్ధమవ్వాలని, గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు సీపీఐ ఆధ్వర్యంలో ఎన్నికల బరిలో నిలవాలని కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నక్కలి జంగయ్య, ఏఐటీయూసీ మండల కార్యదర్శి నారాయణ, నాయకులు నారాయణ, రుక్కయ్య, రాములు, శ్రీశైలం, మధు, రాములు తదితరులు ఉన్నారు.

గుంతల రోడ్డుకు మరమ్మతులు



జేసీబీ సహాయంతో మట్టి పోయిస్తున్న చాకలిగూడ గ్రామస్తులు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని కనకమామిడి నుంచి చాకలిగూడ వరకు వెళ్లే రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను శనివారం గ్రామస్తులందరూ కలిసి జేసీబీ సహాయంతో మట్టి పోసి పూడ్చి వేయించారు. కనకమామిడి నుంచి చాకలిగూడ, వెంకటాపూర్ రోడ్డు గుంతలమయంగా మారి ఏళ్లు గడుస్తున్నా రోడ్డు దుస్థితి మారడం లేదని పేర్కొంటున్నారు. ప్రభుత్వాలు మారిన రోడ్ల పరిస్థితి అలానే ఉందని, ఎవరో వచ్చి ఏదో చేస్తారు అని అనుకోవడం కంటే మనమే గుంతలను పూడ్చుకుందామని ఆ గ్రామస్తులు కలిసి జేసీబీ సహాయంతో ఏర్పడిన గుంతల్లో మట్టిని పోసి పూడుస్తున్నారు. కార్యక్రమంలో చాకలిగూడ గ్రామస్తులు దర్శన్‌గౌడ్, శ్రీరామ్, అంజయ్య, ఎండి జహంగీర్, ఎండి అఫ్సర్, దయాకర్‌గౌడ్, సుధాకర్‌గౌడ్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

జీతాలు ఇవ్వరా?

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామ పంచాయతీలో పని చేస్తున్న కార్మికులు శనివారం మూడునెలలు అవుతున్నా జీతాలు రావడం లేదని, మేము ఎలా పని చేయాలి, ఏం తినాలి అని గ్రామ పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణిని అడిగారు. ప్రతి రోజు రోడ్లు, మురికి కాల్వలు తీస్తున్నామని, ఎక్కడైనా చెత్త కనబడితే వెంటనే ఫోన్ చేసి అక్కడ చెత్త ఉంది, మురికి నీరు ఉంది అని చెప్తారు కానీ మా జీతాల గురించి మాట్లాడరని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేసి తింటున్నామని, ఇప్పటికైనా మాకు జీతాలు వచ్చే విధంగా చూడాలని పంచాయతీ కార్యదర్శిని కోరారు. ఈ విషయాన్ని సంధ్యారాణిని వివరణ కోరగా.. ప్రతి నెల అటెండెన్స్ రూపంలో వేతనాల కోసం పంపిస్తున్నాం. వేతనాలు మీ అకౌంట్‌లోకే వస్తాయి. కానీ మూడునెలలుగా వేతనాలు రావడం లేదని తెలుస్తోంది. పై అధికారులకు తెలియజేస్తామని సిబ్బంది, కార్మికులతో తెలిపారు.

ఆర్థికసాయం

కేశంపేట: మండల పరిధిలోని లింగంధన గ్రామానికి చెందిన నాగిళ్ల కరుణమ్మ అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. మృతురాలిది నిరుపేద కుటుంబం కావడంతో స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డిలు రూ.5వేల చొప్పున, గ్రామ మాజీ సర్పంచ్ ఎడ్మ రాంరెడ్డి, అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు రూ.3వేల చొప్పున, ప్రతాప్ రూ.2వేలను బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు నాగిళ్ల భాస్కర్, నాయకులు బలరాం, రామస్వామి, శేఖర్, ప్రశాంత్, శ్రీశైలం, బాలయ్య, పురుషోత్తం, వినయ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ఎంపీడీఓ వెంకయ్య

శంకర్‌పల్లి: రానున్న రెండు వారాలు మండలంలోని అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్య పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలోని 18గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, మరమ్మతుల కల్పన కోసం నిధులు మంజూరైనట్లు తెలిపారు. అదే విధంగా వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకోని శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి, వారికి ప్రత్యేక వసతి సౌకర్యాలు కల్పించాలని, అవసరమైన చోట్ల మొరం వేసి గుంతలను పూడ్చాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 3 నుంచి 11వరకు బడిబాట కార్యక్రమం ప్రారంభమవుతుందని, ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ గీత పాల్గొన్నారు.

కలగానే కళాశాల!

- మొయినాబాద్‌లో ప్రభుత్వ జూనియర్ కాలేజీ లేక ఇబ్బందులు
- ఏళ్లు గడుస్తున్నా అమలుకు నోచని పాలకుల హామీ
- ఉన్నత విద్యకు దూరమవుతున్న పేద విద్యార్థులు



మొయినాబాద్ నుంచి ప్రైవేటు కళాశాలలకు వెళ్తున్న విద్యార్థులు(ఫైల్)

మొయినాబాద్: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు కలగానే మిగిలింది. కళాశాల అందుబాటులో లేక పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. నగర శివారు ప్రాంతం కావడంతో చేవెళ్ల నియోజకవర్గంలో అనేక పెద్ద పెద్ద ప్రైవేట్ కళాశాలలు ఉన్నా.. అందులో విద్యను అభ్యసించే స్తోమత లేకపోవడంతో 10వ తరగతి పూర్తి చేసిన ప్రతిభ గల పేద విద్యార్థులు మధ్యలోనే విద్యను ఆపేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా మండల ప్రజలు ప్రభుత్వ జూనియర్ కళాశాల కోసం ఎదురుచూస్తున్నా అది కలగానే మిగిలిపోతోంది. ఎన్నికల సమయంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుపై హామీలు ఇస్తున్న నేటికీ ఆ మాటలు మూటలుగానే మిగిలుతున్నాయి. దీంతో మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు కలగానే మిగులుతోంది. మొయినాబాద్ మండలంలో 14 జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ప్రతీ సంవత్సరం సుమారు 700 మంది విద్యార్థులు పదో తరగతి పూర్తి చేస్తున్నారు. పదో తరగతి పాసైన విద్యార్థులు ఇంటర్ చేయాలంటే మాత్రం ప్రైవేట్ కళాశాలలకే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేదు. దీంతో చాలామంది మండలంలోని ప్రైవేట్ కళాశాలలతో పాటు చేవెళ్ల, బండ్లగూడ, మెహదీపట్నంలోని ప్రైవేట్ కళాశాలలకు వెళ్తున్నారు. ఈ ఏడాది సైతం మండలంలో సుమారు 550 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతి పాసయ్యారు. వారంతా ఇంటర్ చదువుల కోసం ప్రైవేట్ కళాశాలలకే వెళ్లాల్సి వస్తుంది.

అందుబాటులో లేని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు..

మండలంలో పదో తరగతి పాసైన విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు అందుబాటులో లేవు. చేవెళ్లలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉన్నా ఆ మండలంలోని విద్యార్థులకే అందులో పూర్తి స్థాయిలో సీట్లు దొరకడం లేదు. ఇక మొయినాబాద్ మండలంలోని విద్యార్థులకు అక్కడి కళాశాలలో సీట్లు దొరకడం గగనమే. దీంతో చాలా మంది విద్యార్థులు ప్రైవేటు కళాశాలలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇది పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు భారంగా మారుతోంది. ప్రైవేటు కళాశాలల్లో ఫీజులు కట్టలేని స్థితిలో ఉన్న కొంతమంది తల్లిదండ్రులు 10వ తరగతితోనే తమ పిల్లల చదువులను మాన్పించేస్తున్నారు.

నెరవేరని నేతల హామీలు..

మొయినాబాద్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు కోసం గత ఇరవై ఏళ్లుగా ప్రతి ఎన్నికల్లోనూ అన్ని పార్టీల నేతలు హామీలు ఇస్తూ వస్తున్నారు. ఎన్నికల్లో గెలిచాక ప్రజాప్రతినిధులు ఆ విషయాన్నే మర్చిపోతున్నారు. ఏళ్లుగా మండల ప్రజలు ప్రభుత్వ జూనియర్ కళాశాల కోసం ఎదురుచూస్తున్నారు. విద్యార్థి సంఘాలు సైతం ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలు సైతం అందజేశారు. అయినా ఇప్పటివరకు కల ఫలించలేదు. కొత్త ప్రభుత్వమైనా దీనిపై దృష్టి పెట్టాలని మండలంలోని విద్యార్థులు, విద్యార్థి సంఘాల నేతలు కోరుతున్నారు.

ప్రైవేటు కళాశాలకు వెళ్తున్నా



చిన్నమంగళారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదివి పాస్ అయ్యాను. ఇంటర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదవాలనుకుంటే మొయినాబాద్ మండలంలో ప్రభుత్వ కళాశాల లేదు. దీంతో చేవెళ్లలో ప్రైవేట్ జూనియర్ కళాశాలలో చేరాను. దీంతో మా కుటుంబంపై ఆర్థిక భారం పెరుగుతోంది.

– పల్లవి, విద్యార్థిని, చిన్నమంగళారం

ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు



మొయినాబాద్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని గత ఇరవై ఏళ్లకుపైగా ఎదురుచూస్తున్నాం. ఇప్పటివరకు చాలా ప్రభుత్వాలు మారాయి. కానీ ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో అన్ని పార్టీల నాయకులు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుపై హామీలు ఇచ్చారు. తర్వాత మర్చిపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తే విద్యార్థులకు మేలు జరుగుతుంది.

– శ్రీకాంత్, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

సీఎం దృష్టికి తీసుకెళ్తా..



హైదరాబాద్‌కు చేరువలో ఉన్న మొయినాబాద్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు ఎంతో అవసరం. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తాం. ప్రజా ప్రభుత్వంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయిస్తాం.

– గౌరి సతీశ్, టీపీసీసీ అధికార ప్రతినిధి

స్వప్న మిట్టపల్లికి డాక్టరేట్

మొయినాబాద్‌రూరల్: ప్రస్తుత కాలంలో జీవ సాంకేతిక రంగం సమాజానికి ఎంతో అవసరమని, పరిశోధనలు సమాజానికి ఉపయోగపడేలా ఉండాలని అప్పుడే తమకు గుర్తింపు లభిస్తుందని చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ఆచార్య క్రిష్టఫర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ సమీపంలో గల చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీలో స్వప్న మెట్టుపల్లి జీవ సాంకేతిక శాస్త్ర విభాగంలో స్టడీస్ ఆన్ జెనటిక్ ట్రాన్స్‌ఫరేషన్ ఆఫ్ డిఫెన్స్ జీన్ అగేన్ ఫంగల్ పతోజన్ ఇన్ గ్రౌండ్ నట్(అరకీస్ ఐపోజీయా) అనే అంశంపై రాజేందర్ పొడ్లురి పర్యవేక్షణలో స్వప్న మిట్టపల్లి పరిశోధన చేశారు. ఈ సందర్భంగా ఆమెను అభినందిస్తూ శనివారం డాక్టరేట్ సర్టిఫికెట్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో చీఫ్ అడ్మినిస్ట్రేట్ అధికారి సాత్వికరెడ్డి, రిజిస్ట్రార్ రవీందర్, జగదీశ్వర్, సుందర్‌రామ్, రాజు, గాదె రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



స్వప్నకు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న వైస్ ఛాన్స్‌లర్ క్రిష్టఫర్

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



షాబాద్‌లోని ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

షాబాద్: ఫర్టిలైజర్ దుకాణాల్లో నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని, ప్రభుత్వ అనుమతులు ఉన్న ఎరువులు, విత్తనాలనే విక్రయించాలని షాబాద్ మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటేశం పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఫర్టిలైజర్ దుకాణాలను డిప్యూటీ తహసీల్దార్ మధు, ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డిలతో కలిసి తనిఖీలు నిర్వహించారు. షాపుల్లోని స్టాకు నిల్వలను, స్టాకు రిజిస్టర్‌లను, బిల్లు పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు విత్తనాల కొరత రాకుండా తగినన్నీ నిల్వలు పెట్టాలని, ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు అమ్మితే ఆ డీలర్స్‌పై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు మాత్రమే విక్రయించాలని సూచించారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణాల్లో తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి తదితరులున్నారు.

మొయినాబాద్: మొయినాబాద్‌లోని మూడు ఫర్టిలైజర్ దుకాణాల్లో శనివారం మండల వ్యవసాయాధికారి రాగమ్మ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. పత్తి, ఇతర విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయా అనే విషయాలను తెలుసుకున్నారు. రికార్డులు, బిల్లులను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి రాగమ్మ మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు, ఎరువులను డీలర్లు అందుబాటులో ఉంచాలన్నారు. లూజు విత్తనాలు విక్రయించొవద్దని, విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. రైతులు లైసెన్సు ఉన్న డీలర్ల వద్దనే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. వానాకాలం పంటకు సంబంధించిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు.

పాఠశాలల అభివృద్ధికి కృషి చేద్దాం

ఎంపీడీఓ సంధ్య



సమావేశంలో పాల్గొన్న అధికారులు

మొయినాబాద్‌రూరల్: అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధిలో అందరం భాగస్వాములమై పాఠశాలల బలోపేతానికి కృషి చేద్దామని మండల అభివృద్ధి అధికారి సంధ్య పేర్కొన్నారు. శనివారం మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖకు అనుగుణంగా అమ్మ ఆదర్శ పాఠశాల అభివృద్ధిలో భాగంగా బడి బాట, యూనిఫాం కుట్టడం, రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాలకు సంబంధించిన వా టిపై చర్చించారు. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానుండడంతో విద్యార్థులకు దుస్తులు, ఉచిత భోజనం, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ అందజేస్తామన్నారు. అదే విధంగా జిల్లా కలెక్టర్ ఆదేశాలనుసారం పాఠశాలల్లో మరమ్మతులు, అభివృద్ధి పనులకు ప్రభుత్వం ద్వారా లక్ష రూపాయలు అందించిందన్నారు. జిల్లాలో 1360 స్కూళ్లను మొదటి విడతలో ఎంపిక చేశారని అందు లో మొయినాబాద్ మండలంలో మొదటి విడత 19 పాఠశాలలు ఉన్నాయన్నారు. మండలంలో మొత్తం 51 పాఠశాలల్లో 19 పాఠశాలలను తీసుకున్నారని పేర్కొన్నారు. ఎంపిక చేసిన పాఠశాలల్లో మరమ్మతులకు లక్ష రూపాయలకు అదనంగా అయ్యే ఖర్చు ఉంటే రివైజ్ ఇస్టిమెంట్ చేసి పంపిస్తే లక్షకు పైగా వచ్చే అవకాశం ఉందన్నారు.

ఈ నెల 3 నుంచి 17 వరకు బడి బాట..

ఈ విద్యా సంవత్సరం పునఃప్రారంభం కానుండడంతో గ్రామాల్లోని ఆయా పాఠశాలల ద్వారా అన్ని శాఖల అధికారులు పాల్గొని బడి బాటను నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ బడిబాట రేపు 3వ తేదీ సోమవారం నుంచి ప్రారంభమై 17వ తేదీ వరకు నిర్వహించాలని సూచించారు. పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు కావాల్సిన యూనిఫాం, భోజనం, పుస్తకాలు అన్ని ముందుగానే సమకూర్చుకొని పంపించాలని తెలిపారు. ఎలాంటి లోటు, అవకతవకలు ఉన్నా వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. సమావేశంలో ఎంఈఓ వెంకటయ్య, మండల సెక్టోరియల్ అధికారి జావిద్ అహ్మద్, మండల డిప్యూటీ తహసీల్దార్ వినోద్, మండల ఎంపీవో వెంకటేశ్వర్‌రెడ్డి, మొయినాబాద్ ఎస్సై నర్సింహులు, ఐకేపీ ఏపీఎం రవీందర్, పంచాయతీ కార్యదర్శులు తారాబాయి, రంజిత్, సంధ్యారాణి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల పరిశీలన

శంకర్‌పల్లి: అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో భాగంగా శంకర్‌పల్లి మున్సిపాలిటీలో ఎంపికైన రెండు ప్రభుత్వ పాఠశాలలను శనివారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ పరిశీలించారు. ఫత్తేపూర్, రామంతపూర్ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, టాయిలెట్స్‌ల పరిస్థితిని గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో పనులు వేగంగా పూర్తి చేయాలని గుత్తేదారునికి సూచించారు. అలాగే, పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులను కోరారు. పరిశీలనలో మున్సిపల్ ఏఈ, మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి



అజీజ్‌నగర్‌లో పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు



చేవెళ్లలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

మొయినాబాద్‌రూరల్: హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో గల హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆలయాల్లో అర్చకులులు హనుమాన్ చాలీసా పారాయణాన్ని పఠిస్తూ పూజా కార్యక్రమాలు చేశారు. భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో..

కొందుర్గు: మండల కేంద్రంలో శనివారం అర్చకుడు రాజేశ్వరస్వామి ఆధ్వర్యంలో లక్ష్మీనర్సింహస్వామి వారికి అభిషేకం, హనుమతుండికి సింధూర అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి శోభాయాత్ర చేపట్టారు.

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో గల హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ సర్పంచ్ రాఘవేందర్‌గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి అభిషేకం, పుష్పార్చన పూజలు నిర్వహించారు. అనంతరం హనుమాన్ చాలీసాను పఠించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు మల్లేశ్, గ్రామస్తులు సుమన్‌గౌడ్, రవీందర్‌గౌడ్, నర్సింలు, నరేశ్‌గౌడ్, కిరణ్, ప్రసాద్, ప్రశాంత్, శ్రీనివాస్, బాలకృష్ణ, పెంటయ్య, రమేశ్, చెన్నరాములు, రవి, తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో గల హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. చేవెళ్లలోని వేంకటేశ్వరస్వామి పుష్కరిణీ పక్కనే ఉన్న మనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు కొనసాగించారు. దంపతులు జంటగా పూజలు చేశారు. జై హనుమాన్, జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు.

అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయాలి

షాబాద్: అర్హులైన వృద్ధులకు ప్రభుత్వం వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని కొమరబండ మాజీ సర్పంచ్ ఏశాల చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని కొమరబండ గ్రామానికి చెందిన కుమ్మరి భారతమ్మకు పింఛన్ రాకపోవడంతో గ్రామస్తులు ప్రతి నెల ఒక్కరి చొప్పున డబ్బులు పోగుచేసి ఒక్కొక్కరుగా తోచినంత ఆర్థికసాయం చేయాలని నిర్ణయించారు. మొదటి విడతగా నారమోని వెంకటయ్య రూ.1వేయి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత సంవత్సరం నుంచి అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ప్రభుత్వం నుంచి కొత్త పింఛన్లు మంజురు చేయలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు అందేలా చూడాలన్నారు. ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలు తగిన గుణపాఠం చెప్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులున్నారు.

పెండింగ్ కేసులను పరిష్కరించుకోవాలి

రిటైర్డు జడ్జి సాంబశివరావు



లోక్ అదాలత్‌లో పాల్గొన్న కోర్టు సిబ్బంది, తదితరులు

చేవెళ్ల: పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ పోలీసు కేసులను పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ కార్యక్రమం కొనసాగుతోందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలనిరిటైర్డు జడ్జి సాంబశివరావు తెలిపారు. మండల కేంద్రంలోని కోర్టు ఆవరణలో చేవెళ్ల ట్రాఫిక్ పోలీసు కేసులపై రెండోరోజు శనివారం లోక్ అదాలత్ కొనసాగింది. ఈ సందర్భంగా రెండోరోజు లోక్ అదాలత్‌లో 74 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పరిష్కరించి 17,700ల జరిమానాలు విధించినట్లు ఆయన చెప్పారు. చేవెళ్ల ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో నమోదైన ట్రాఫిక్ కేసుల పరిష్కారానికి ఈ లోక్ అదాలత్ కొనసాగుతుందన్నారు. ఈ లోక్ అదాలత్ ఈనెల 7వ తేదీవరకు కొనసాగుతుందని. కేసులు నమోదైన వారు ఈ కార్యక్రమం ద్వారా పరిష్కరించుకోవాలని కోరారు. ఆయా పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని ట్రాఫిక్ కేసులు నమోదైన వాహనదారులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం, ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, కానిస్టేబుల్ కవిత, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.